www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

UDYAM - TS-25-0027265

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

మీకు జర్నలిజంపై ఆసక్తి ఉందా.. అయితే ఆ అవకాశాన్ని మీకు మేం కల్పిస్తాం. స్థానిక సమస్యలపై అవగాహన ఉంటే చాలు. సమాజహితమే లక్ష్యంగా వేసే తొలిఅడుగే ఈ తొలిఅడుగు దినపత్రిక ముఖ్య ఉద్దేశం, ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతు, అవినీతిపై సమర శంఖాన్ని పూరిస్తున్న తొలిఅడుగు దినపత్రికలో పనిచేయుటకు ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, హైదరబాద్ జిల్లాలు, నియెజకవర్గాలలో పనిచేయుటకు ఇన్‌చార్జిలు మండల రిపోర్టర్లు కావలెను. జర్నలిజంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

సంప్రదించవలసిన నెం.
944 0884 331

హైదరాబాద్, అమరావతి | సంపుటి : 02 | సంచిక : 47 | గురువారం 24 జూలై 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 08 | వెల: 04



## నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధం

- భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు అధికారం ఉంది.
- ఈ ఎన్నికలు 1952 నాటి ప్రెసిడెన్షియల్ అండ్ వైస్ ప్రెసిడెన్షియల్ ఎలక్షన్స్ యాక్ట్, 1974 నాటి ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించనున్నారు
- జగ్‌దీప్ ధన్‌కడ్ రాజీనామా నేపథ్యంలో నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే ఎన్నికల షెడ్యూల్

# కమలంలో కల్లోలమేనా?



- భారతీయ జనతా పార్టీలో వర్గాలు ఏర్పడ్డాయి అనేది నిజం
- రాజకీయ కార్యశాల కోసం వారు తప్పనిసరి పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీని ఎంచుకున్నారు
- కొన్ని మీడియా సంస్థలు ఈటెల రాజేందర్ వ్యాఖ్యల పట్ల సమయమనం పాటించగా.. ముఖ్యంగా గులాబీ అనుకూల మీడియా సంస్థలు మాత్రం మొహమాటం లేకుండా ఆ మాటలు అన్నది బండి సంజయ్ ని ఉద్దేశించే అని చెప్పేశాయి



### కోటి మంది మహిళలను

## కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- మంత్రి కోమటిరెడ్డి
- ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి అయ్యాయి..దాని విలువ 6680 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు.
- ఆర్టీసీ లో మహిళలకు బస్సులు కొనుగోలు చేసి యజమానులను చేసింది.
- ఆర్టీసీలో ఎవరు ఎక్కడికి వెళ్లాలన్న ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు
- గతంలో ఆర్టీసీ నిర్వీర్యం అయి ప్రైవేట్ పరం అవుతుంది

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా ఎంజీబీఎస్ లో మహా లక్ష్మి సంబరాలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిధులుగా హజరయ్యారు. - మిగతా3లో

# కేంద్రం మెడలు వంచుతాం



- మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు
- దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి
- అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించినం
- బిల్లు ఆమోదానికి కేంద్రంలోని విపక్ష కూటమి నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాం
- “భాజపా నాయకత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది
- ఆ పార్టీ నేతలు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి.. ఇప్పుడు మరో మాట మాట్లాడుతున్నారు

దిల్లీ

కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించినట్లు చెప్పారు. బిల్లు ఆమోదానికి కేంద్రంలోని విపక్ష కూటమి నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని సీఎం గుర్తుచేశారు. కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. “భాజపా నాయకత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఆ పార్టీ నేతలు 42 శాతం రిజర్వేషన్ల - మిగతా3లో



## లోక్‌సభలో ప్రధాని సమక్షంలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ

- సమాధానం ఇవ్వనున్న రాజ్‌నాథ్ సింగ్
- లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం 16 గంటల సమయం
- అటు రాజ్యసభలో కూడా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ



## ట్రంప్ 25 సార్లు అన్నారు

- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- “కేంద్రం ఏమని చెబుతుంది. ట్రంప్ కాల్పుల విరమణ చేయించారనా..?
- ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు. మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి..
- అసలు ట్రంప్ ఎవరు..? అది ఆయన పనికాదు. ప్రధాని సమాధానం ఇవ్వడంలేదు

### పార్టీ బలోపేతానికి

# పాటుపడాలి



- మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేపిలో పెద్దఎత్తున చేరికలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోంది
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపు


హైదరాబాద్

;మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందినా నాయకులు బిజెపిలో పెద్దఎత్తున చేరారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానం తెలిపారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పాటుపడాలి.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోంది.యూపీఏ హయాంలో యూరియా కోసం రైతులు బారులు తీరిన క్యూలైన్లలో గొడవలు జరిగి, లాఠీచార్జీలు - మిగతా3లో

### జూలై 25న లింగంపేట ఆత్మగౌరవ గర్జన..

## హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్



అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత నాయకుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలుపై పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా కామారెడ్డి జిల్లా లింగంపేటలో జూలై 25వ తేదీన ఆత్మగౌరవ గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో దళిత మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ముదాం సాయిలును పోలీసులు అవమానించారు. నిరసన తెలుపుతున్న సాయిలును దౌర్జన్యంగా ఈడ్చుకెల్లి పోలీసులు వాహనం ఎక్కించారు. అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దళిత నాయకుడిపై దౌర్జన్యాన్ని అప్పట్లో అందరూ ఖండించారు. కాగా, తాజాగా సాయిలుకు మద్దతుగా లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై సాయిలును సత్కరించారు.



## దాడి చేస్తే మరాఠీలో మాట్లాడేస్తారా?

- తమిళ అనుభవాన్ని చెప్పిన గవర్నర్
- ‘ఎవరైనా అకస్మాత్తుగా వచ్చి, మరాఠీలో మాట్లాడమంటూ ఆ భాష రానివారిపై దాడి చేస్తే, వారు వెంటనే మరాఠీలో మాట్లాడగలుగుతానా?
- అలా చేస్తే అది మహారాష్ట్రకే హాని కలిగిస్తుంది’

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

## నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధం

**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ రాజీనామా అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు అధికారం ఉంది. ఈ ఎన్నికలు 1952 నాటి ప్రెసిడెన్షియల్ అండ్ వైస్ ప్రెసిడెన్షియల్ ఎలక్షన్స్ యాక్ట్, 1974 నాటి ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించనున్నారు. జగ్‌దీప్ ధన్‌కడ్ రాజీనామా నేపథ్యంలో నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనుంది. కాగా ఈ ప్రక్రియకు సంబంధించిన ఇప్పటికే పలు కీలక కార్యాచరణలు ప్రారంభమైనట్లు కమిషన్ వెల్లడించింది. లోక్‌సభ, రాజ్యసభలకు ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యులతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసినట్లు తెలిపింది. అలాగే రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌లను కూడా ఖరారు చేశారని సమాచారం. త్వరలోనే ఉపరాష్ట్రపతి ఎ?న్నికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పీ. పవన్ తెలిపారు.

## గాజాలో పెరుగుతున్న ఆకలి చావులు..
## 48 గంటల్లో 20 మంది మృతి



ఇజ్రాయెల్ బలగాల దిగ్బంధనంలో విలవిల్లాడుతున్న గాజా ప్రాంతంలో ఆకలి చావుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గడచిన 48 గంటల్లో ఈ ప్రాంతంలో 20 మంది ఆకలితో మరణించారని హమాస్ మంగళవారం ప్రకటించింది. ఇది దిగ్భ్రాంతికర పరిణామమని పాలస్తీనాలో హమాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరోగ్యశాఖ డైరెక్టర్ మునీర్ అల్ బరష్ అన్నారు. గాజాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి మొత్తం 88 మంది ఆకలి చావులకు గురయ్యారనీ, వారిలో 20 మంది గత రెండు రోజుల్లోనే మృతిచెందడం విషమిస్తున్న పరిస్థితికి అద్దంపడుతోందని బరష్ ఆవేదన వ్యక్తంచేశారు. కాగా గాజాలో ఇప్పటివరకు తీవ్ర పోరాటానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లోకి ఇజ్రాయెల్ బలగాలు చొచ్చుకుపోతున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం యథేచ్ఛగా మారణహోమం కొనసాగిస్తోంది.

# 2498(ఏ) కేసుల్లో హడావుడి అరెస్ట్‌లు వద్దు




వరకట్న వేధింపుల కేసుల విషయంలో సుప్రీంకోర్టు తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ 498 (ఏ) కేసు దుర్వినియోగాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా 2022లో అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను సమర్థించింది. వరకట్న వేధింపుల కేసుల్లో భర్త లేదా అతడి కుటుంబ సభ్యులను తొందరపడి అరెస్ట్ చేయరాదని స్పష్టం చేసింది. దేశంలో ఇటీవలి కాలంలో వరకట్న వేధింపుల కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. చిన్న చిన్న కారణాలతో విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కడం ఒకటైతే.. వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ భర్త, అత్తమామలు, ఇతర బంధువులపై 498 (ఏ) కేసులు వేయడమూ మనం చూస్తున్నాం. కొన్ని సందర్భాల్లో ఇవి తప్పుడు కేసులని న్యాయస్థానాల్లో తేలడం, పిటిషనర్లకు హెచ్చరికలు, జరిమానాలు విధించడమూ వినే ఉంటాం. దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం 498 (ఏ) దుర్వినియోగమవుతోందని, అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలు సందర్భాల్లో వ్యాఖ్యానించింది కూడా.

ఈ నేపథ్యంలో మంగళవారం చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ ఎ.జి.మసీహలతో కూడిన బెంచ్ కొన్ని కీలకమైన మార్గదర్శకాలను జారీ చేసింది. వాటి ప్రకారం..

ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత కనీసం రెండు నెలలపాటు ఎలాంటి అరెస్ట్‌లు చేయకూడదు. ఈ సమయం వివాద పరిష్కారానికి అవకాశం కల్పిస్తుంది. ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత ఫిర్యాదులను ముందుగా ప్రతి జిల్లాలోని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలకు రిఫర్ చేయాలి. ఈ కమిటీలో శిక్షణ పొందిన మధ్యవర్తులు, న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, విశ్రాంత న్యాయమూర్తులు, సీనియర్ అధికారులు లేదా వారి సహచరులు ఉండాలి. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ సభ్యులను సాక్షులుగా న్యాయస్థానాలు పిలవకూడదు. వివాద పరిష్కారానికి ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలో జరిగే చర్చల్లో ఇరు పక్షాల వారు కనీసం నలుగురు బంధువులు (పెద్దవాళ్లు)లను భాగస్వాములుగా చేయాలి. ఆ తరువాత ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ తదుపరి చర్యల కోసం పోలీసులు, మేజిస్ట్రేట్లకు వివరణాత్మకమైన నివేదిక సమర్పించాలి. (ఇదంతా రెండు నెలల్లోపు పూర్తి కావాలి) ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ చర్చలు జరుగుతున్న సమయంలో పోలీసులు ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడరాదు. అయితే సాధారణ విచారణను మాత్రం పోలీసులు కొనసాగించవచ్చు. కమిటీ సభ్యులకు, విచారణ అధికారులకు ప్రత్యేకమైన శిక్షణ కల్పించాలి. వివాదం ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలోనే సమసిపోతే జిల్లా జడ్జీలు క్రిమినల్ కేసులను మూసివేయవచ్చు.

**దుర్వినియోగం తగ్గుతుందా?**

498(ఏ) దుర్వినియోగం తగ్గేందుకు ఈ కొత్త మార్గదర్శకాలు ఉపయోగపడతాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. చాలా సందర్భాల్లో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ సభ్యులు తగిన పద్ధతి లేకుండానే అనవసరమైన వేధింపులకు గురవుతూంటారని, అలాంటి వాటిని ఈ మార్గదర్శకాల అమలుతో అరికట్టవచ్చునని వారు వివరిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. సుప్రీంకోర్టు తాజా నిర్ణయానికి దారి తీసిన కేసులో భర్తతోపాటు అతడి తండ్రిని కూడా సుమారు వంద రోజులపాటు జైలు నిర్బంధం అనుభవించాల్సి వచ్చింది. వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ భార్య వేసిన కేసులో హత్యాయత్నం, మానభంగం వంటి ఆరోపణలూ చేయడంతో ఆ పరిస్థితి ఏర్పడింది.

## జస్టిస్ వర్మ కోసం టాప్ లాయర్లు..
# విచారణకు సీజేఐ దూరం



జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టల ఆరోపణల వ్యవహారంలో శరవేగంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు పార్లమెంట్‌లో ఆయన్ని అభిశంసించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు.. సుప్రీం కోర్టులో ఆయన వేసిన పిటిషన్‌పై ఇవాళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్ విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం వైదొలిగారు. ఈ పిటిషన్‌ను విచారించేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారాయన. "బహుశా ఈ పిటిషన్‌ను నేను విచారణ చేయలేనుకుంటా. ఎందుకంటే.. జస్టిస్ సంజీవ్ ఖన్నా(మాజీ సీజేఐ) నేతృత్వంలో జరిగిన విచారణలో నేను భాగమయ్యాను. కాబట్టి దీన్ని వేరొక బెంచ్‌కు బదిలీ చేస్తా" అని పిటిషన్ తరఫు న్యాయవాది కపిల్ సిబాల్‌కు సీజేఐ స్పష్టం చేశారు. మార్చి 14వ తేదీన ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం సంభవించి.. కాలిన స్థితిలో నోట్ల కట్టలు కనిపించాయి. 'న్యాయవ్యవస్థలో అవినీతి..' అంటూ ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు.. ఆయన్ని హుటాహుటిన అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేసింది. అదే సమయంలో ఈ ఘటనపై దర్యాప్తునకు ముగ్గురు జడ్జిల కమిటీని ఏర్పాటు చేయించింది. ఆ కమిటీ తన నివేదికను అప్పటి చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందించగా.. ఆయన దానిని లేఖ రూపంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పంపారు. ఆ నివేదిక ప్రకారం.. జస్టిస్ యశ్వంత్ వర్మ అవినీతికి పాల్పడ్డారని, స్వచ్ఛందంగా రాజీనామాకు ఆయన అంగీకరించలేదని, కాబట్టి ఆయన్ని తొలగించాలని ఇన్-హౌజ్ కమిటీ సిఫార్సు చేసింది. అయితే తన వాదన వినకుండానే చర్యలు తీసుకుంటున్నారని సుప్రీం కోర్టులో జడ్జి యశ్వంత్ వర్మ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఇవాళ(బుధవారం) ఆయన తరఫు లాయర్ కపిల్ సిబాల్ సీజేఐ బెంచ్‌ను కోరారు. జస్టిస్ వర్మ తరఫున కపిల్ సిబాల్‌తో పాటు ముకుల్ రోహత్గి, రాకేష్ ద్వివేది, సిద్ధార్థ్ లూథ్రాలాంటి టాప్ లాయర్లు వాదనలు వినిపిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ పార్లమెంట్ సెషన్‌లోనే ఆయనపై అభిశంసనకు చర్యలు నడుస్తున్నాయి. ఇలాంటి అభిశంసన తీర్మానం కోసం లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యులు అభిశంసన నోటీసుపై సంతకం చేయాలి. అయితే జస్టిస్ వర్మ కేసులో ఇప్పటికే 145 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు ఇప్పటికే అభిశంసన నోటీసుపై సంతకం చేశారు. జడ్జి తొలగింపు కోసం భారత రాజ్యాంగంలోని 124, 217, 218 ఆర్టికల్స్ ప్రకారం నోటీసు దాఖలైంది. అయితే.. ఎంపీలు ఇచ్చిన అభిశంసన నోటీసును స్వీకరించిన కొన్ని గంటలకే రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి అయిన జగ్దీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

**నెక్స్ట్ ఏంటంటే..**

లోక్‌సభ స్పీకర్ , రాజ్యసభ ఛైర్మన్ సంయుక్తంగా ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని నియమించనున్నారు. ఈ కమిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఒకరు, ఓ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఓ ప్రఖ్యాత న్యాయవేత్త ఉంటారు. ఈ కమిటీకి నివేదిక సమర్పించడానికి మూడు నెలల గడువు ఇస్తారు. అయితే ఈ కమిటీ ముందు తన వాదనలు వినిపించేందుకు జస్టిస్ యశ్వంత్ వర్మకు అవకాశం(మూడుసార్లు) ఉంటుంది. గతంలో త్రీజడ్జి కమిటీ సమర్పించిన నివేదికతో పాటు జస్టిస్ వర్మ వాదనలు, సాక్ష్యాలను పరిశీలించాకే స్పెషల్ కమిటీ ఒక నివేదికను సమర్పిస్తుంది. ఈపై ఇరు సభల్లో ఆ నివేదికపై చర్చ జరిగాక.. అభిశంసన తీర్మానాన్నిప్రవేశపెడతారు. దానిని 2/3 మెజారిటీతో సభ్యులు ఆమోదించాక రాష్ట్రపతికి పంపిస్తారు. అప్పుడు ఆయన తొలగింపుపై రాష్ట్రపతి సంతకం చేసి ఉత్తర్వులు జారీ చేస్తారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతున్నాయి. అదే సమయంలో ఆయన పిటిషన్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆగష్టు 21వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్నాయి. ఈ తరుణంలో ఆయన్ని తొలగించడం ఈ సెషన్‌లో సాధ్యం కాకపోవచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్-పాక్ వివాదంపై పాతపాటే ఎత్తుకున్న అమెరికా.. దీటుగా జవాబిచ్చిన భారత్

భారత్-పాక్ విషయంలో అగ్రరాజ్యం అమెరికా మళ్లీ పాతపాటే ఎత్తుకుంది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల తగ్గింపులో అమెరికా పాత్ర కీలకమని పేర్కొంది. అంతర్జాతీయ శాంతి, భద్రతల అంశంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో జరిగిన ఉన్నత స్థాయి చర్చలో అమెరికా రాయబారి డోరతీ షియా ఈ మేరకు వ్యాఖ్యానించారు. గత మూడు నెలల్లో ఇజ్రాయెల్-ఇరాన్, భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల తగ్గింపులో అమెరికా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా వివాదాలకు మధ్యవర్తిత్వం వహించడం, శాంతియుత పరిష్కారాలను ముందుకు తీసుకెళ్లడంలో అమెరికా నిబద్ధతతో ఉంది. ఇటీవలే భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలన కీలక పాత్ర పోషించింది' అని యూఎన్ భద్రతా మండలి బహిరంగ చర్చలో వ్యాఖ్యానించారు.



అమె రికా వాదనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు ఐరాస భద్రతా మండలిలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం అనేది కేవలం భారత్, పాకిస్థాన్ మధ్య నేరుగా జరిగిన సైనిక చర్చల ఫలితమేనని స్పష్టం చేశారు. పాక్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు వెల్లడించారు. ఈ వివాదంలో ఎవరి ప్రమేయం లేదని.. ఇదే విషయాన్ని అమెరికాకు కూడా ఇప్పటికే స్పష్టంగా చెప్పినట్లు భారత రాయబారి గుర్తు చేశారు.

## లోక్‌సభలో ప్రధాని సమక్షంలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ..




లోక్‌సభలో ఈ నెల 28 నుంచి ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విశ్వసనీయ వర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం.. లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం 16 గంటల సమయం కేటాయించారు. ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో చర్చ జరగనుంది. చర్చ ముగిసిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చపై సమాధానం ఇవ్వనున్నారు. అటు రాజ్యసభలో కూడా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే రాజ్యసభలో 9 గంటలపాటు చర్చ జరగనుంది. జూలై 29 నుంచి చర్చ చేపట్టనున్నారు. రాజ్యసభలో కూడా చర్చకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇస్తారు. కాగా ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడ్డారు. మహిళలు, చిన్నారులను వదిలేసి పురుష పర్యాటకులే లక్ష్యంగా కాల్చిచంపారు. కొన్ని నిమిషాల వ్యవధిలో మొత్తం 26 మంది ప్రాణాలు తీశారు. వారిలో ఒకరు నేపాల్ జాతీయుడు కాగా, మిగతా వాళ్లంతా భారతీయులు. అయితే ఈ దాడికి ప్రతీకారంగా భారత్.. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులకు పాల్పడింది.

## ట్రంప్ 25 సార్లు అన్నారు



**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధినేత ట్రంప్ 25 సార్లు చెప్పారని దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. "కేంద్రం ఏమని చెబుతుంది. ట్రంప్ కాల్పుల విరమణ చేయించారనా..? కానీ అలా చెప్పలేరు. అయినా, అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు. మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి.. కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు..? అది ఆయన పనికాదు. ప్రధాని సమాధానం ఇవ్వడంలేదు. అది వాస్తవం.. " అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**మరో సారి ట్రంప్ నోట అదే మాట..**

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. కాకపోతే.. ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణు యుద్ధం వరకు వెళ్లేదన్నారు. రెండు వైపులా యుద్ధవిమానాలు కూలిపోయినట్టు పేర్కొన్నారు. మరోవైపు ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ వైపు నష్టం జరిగినట్టు కనీసం ఓ గాజు పెంకునైనా చూపించాలని సవాల్ చేయడం గమనార్హం.

## దాడి చేస్తే మరాఠీలో మాట్లాడేస్తారా?'



**ముంబై:** మహారాష్ట్రలో కొనసాగుతున్న భాషా వివాదంపై రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఎవరైనా అకస్మాత్తుగా వచ్చి, మరాఠీలో మాట్లాడమంటూ ఆ భాష రానివారిపై దాడి చేస్తే, వారు వెంటనే మరాఠీలో మాట్లాడగలుగుతానా?.. అలా చేస్తే అది మహారాష్ట్రకే హాని కలిగిస్తుంది' అని వ్యాఖ్యానించారు. తమిళనాడులో తాను ఉన్న సమయంలో ఇలాంటి భాషా వివాదాన్ని చూశానని తెలిపారు. ఒకరోజు రాత్రి ఒంటిగంట ప్రాంతంలో తాను కారులో ప్రయాణిస్తుండగా, రోడ్డు పక్కన ఒక వ్యక్తిపై పలువురు దాడి చేయడాన్ని తాను చూశానన్నారు. తరువాత తాను జోక్యం చేసుకుని, ఆరా తీయగా, బాధితుడు ఉత్తర భారతదేశానికి చెందిన లారీ డ్రైవర్ అని తెలిసిందన్నారు. అతను హిందీలో మాత్రమే మాట్లాడగలడని, అయితే దాడి చేసిన వారు అతనిని తమిళంలో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నారని తెలుసుకున్నానన్నారు. భాషపై ద్వేషాన్ని వ్యాప్తి చేయడం ప్రమాదకరమని గవర్నర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ప్రజలను విభజించడమే కాకుండా ఇతరులు రాష్ట్రానికి రాకుండా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో కొత్త పరిశ్రమలు ఇక్కడికి రావని ఆయన హెచ్చరించారు. ప్రజలంతా పరస్పర గౌరవాన్ని పెంపొందించుకోవాలని, భాష ఎప్పుడూ హింస లేదా వివక్షకు కారణం కాకూడదని గవర్నర్ పేర్కొన్నారు. మనం మాతృభాషను చూసి గర్వపడుతూనే ఇతర బాషలను కూడా నేర్చుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. గవర్నర్ వ్యాఖ్యలను సమర్థించిన మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ మాట్లాడుతూ 'మరాఠీ మన మాతృభాష. అది మనకు గర్వకారణం. అయితే ఎవరైనా మరాఠీలో మాట్లాడాలని బలవంతం చేయడం లేదా వారిపై దాడి చేయడం సరైనది కాదు. మనం కూడా మహారాష్ట్రను దాటి ఎప్పుడైనా బయటకు వెళతాం. అక్కడ ఎవరైనా తమిళం లేదా బెంగాలీలో మాట్లాడాలని డిమాండ్ చేస్తే మనం ఏం చేయగలం? అని ?ప్రశ్నించారు. అన్ని భాషలను గౌరవించాలని గిరీష్ మహాజన్ అన్నారు.

## దేశంలో భారీ ఉగ్రకుట్ర భగ్నం..
## నలుగురు ఉగ్రవాదులు అరెస్ట్



అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ భారత్‌లో భారీ దాడులకు ప్లాన్ చేసింది. అయితే అల్ ఖైదా కుట్రను గుజరాత్‌కు చెందిన ఏటీఎస్ పోలీసులు భగ్నం చేశారు. అల్ ఖైదాతో సంబంధం ఉన్న నలుగురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరిని గుజరాత్‌లో అరెస్ట్ చేయగా.. ఒకరిని ఢిల్లీలో, మరొకరిని నోయిడాలో అదుపులోకి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్థాన్‌లోని పలు ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. అల్ ఖైదాకు సంబంధించిన ఉగ్రవాద శిబిరాలపై కూడా భారత ఆర్మీ దాడులకు పాల్పడింది. ఆ సంస్థకు చెందిన పలువురు ప్రముఖులను మట్టుబెట్టింది. దాంతో అప్పట్లోనే అల్ ఖైదా భారత్‌కు వార్నింగ్ ఇచ్చింది. ఈ క్రమంలో ఇండియన్ ఇంటెలిజెన్స్ అధికారులు అప్రమత్తయ్యారు. దేశంలో ఉగ్రవాదుల కదలికలపై నిఘా పెంచారు. ఫలితంగా ఇప్పటికే పలు ఉగ్రకుట్రలు భగ్నం అయ్యాయి. తాజాగా మరో నలుగురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ నలుగురు ఉగ్రవాదులను మహమ్మద్ ఫైక్, మహమ్మద్ ఫర్దీన్, సెఫుల్లా కురేషి, జీషన్ అలీగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వారిని అధికారులు విచారిస్తున్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# పార్టీ బలోపేతానికి పాటుపడాలి

-మొదటిపేజీ తరువాయి

జరిగిన అనేక ఘటనలు చూశాం.దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కొరత లేకుండా, ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోంది.అయినా ఇటీవల బిజెపిని బద్నాం చేయడానికి కొన్ని శక్తులు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయి.రబీ సీజన్ కోసం తెలంగాణకు అవసరమైన యూరియా 9.5 లక్షల మెట్రిక్ టన్నులు. కేంద్రం సరఫరా చేసిన యూరియా: 12.02 లక్షల మెట్రిక్ టన్నులు. ఇది అవసరానికి మించి 2.5 లక్షల టన్నుల అదనపు సరఫరా.అయినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ఫెర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కేంద్రం పంపిన ఎరువులను రాష్ట్రంలోని కొంతమంది బ్లాక్ మార్కెట్‌కి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెట్, ఎరువుల డీలర్లపై సరైన మానిటరింగ్ లేకపోవడం, సరఫరా వ్యవస్థపై రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం.. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ పాలనాపరమైన వైఫల్యానికి నిదర్శనం.యూరియా బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. తెలంగాణ రాష్ట్రానికి ఎంత మేర అవసరమో అంత మేర యూరియా ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో రైతుల్లో



అపోహలు సృష్టిస్తోంది.మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్ వంటి ప్రాంతం కాటన్ సీడ్ బౌల్‌గా పేరుగాంచింది. అలాంటి ప్రాంతాల్లో కూడా కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఫెర్టిలైజర్ షాపులతో కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నారు.పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు.. వార్డు మెంబర్ స్థాయి నుంచి జడ్పీటీసీ స్థాయివరకు సిద్ధంగా ఉండాలి.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బిజెపి డిమాండ్ చేస్తోంది. అయినా దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని బిజెపిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటు.బిజెపిపై తప్పుడు ప్రచారం చేయడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.రాష్ట్రంలో బిజెపి కి మంచి వాతావరణం ఉంది. కాబట్టి నాయకులు, కార్యకర్తలు మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకుండా కలిసిమెలిసి పని చేసి బిజెపిని గెలిపించాలి.బిజెపి మనకు తల్లిలాంటి పార్టీ. అలాంటి పార్టీకి ఎవరూ కూడా ద్రోహం చేయరాదు.మహబూబ్ నగర్ ఎంపీ స్థానంతో పాటు మున్సిపాలిటీలు, నారాయణపేట మున్సిపాలిటీ, మక్తల్ చైర్మన్ స్థాయిలలో బిజెపి విజయాలు సాధించింది.రానున్న రోజుల్లో బిజెపి రాష్ట్రంలో మరింత బలమైన వాతావరణం ఉంది. అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతోంది.గతంలో నేను ఎమ్మెల్సీగా రాష్ట్రవ్యాప్తంగా సేవలందించాను. ఆ సమయంలో మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలు నాపై విశేష ఆదరణ చూపారు.రేపు (జూలై 24) మహబూబ్ నగర్ జిల్లాలో నా పర్యటనలో భాగంగా బిజెపి శ్రేణులంతా ఐక్యతను ప్రదర్శించి ప్రజల్లో మరింత విశ్వాసం పెంచాలి.కొత్తవారు, పాతవారు అనే భేదం లేకుండా నాయకులు, కార్యకర్తలు అందరూ కలసికట్టుగా పని చేసి బిజెపి ని అధికారంలోకి తీసుకురావడంలో కృషి చేయాలి.

# కమలంలో కల్లోలమేనా?

**హైదరాబాద్ :** దాపరికమేమీ లేదు. దాచినంత మాత్రాన దాగదు. భారతీయ జనతా పార్టీలో వర్గాలు ఏర్పడ్డాయి అనేది నిజం. అందులో కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా మిగతా వారంతా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే.. ఇప్పుడు ఎంపీలుగా ఉన్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, గోడం నగేష్, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ వంటి వారంతా ఇతర పార్టీలలో గతంలో పనిచేసినవారే. రాజకీయ కార్యశాల కోసం వారు తప్పనిసరి పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీని ఎంచుకున్నారు ఈటెల రాజేందర్, బండి సంజయ్ మధ్య ఇటీవల మాటల తూటాలు బయటికి వచ్చాయి. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఏమన్నారో తెలియదు గాని.. ఈటల రాజేందర్ అన్న మాటలు మాత్రం మీడియాలో సంచలనంగా మారాయి. కొన్ని మీడియా సంస్థలు ఈటెల రాజేందర్ వ్యాఖ్యల పట్ల సమయమనం పాటించగా.. ముఖ్యంగా గులాబీ అనుకూల మీడియా సంస్థలు మాత్రం మొహమాటం లేకుండా ఆ మాటలు అన్నది బండి సంజయ్ ని ఉద్దేశించే అని చెప్పేశాయి. ఇద్దరి మధ్య ఏకంగా వార్ నడుస్తోందని.. 8 మంది పార్లమెంటు సభ్యులను తెలంగాణ నుంచి గెలిపించి పంపిస్తే.. చివరికి వారు చేస్తోంది ఇది అని రాసింది. ఇంత జరిగిన తర్వాత తెలంగాణ పార్టీ అధ్యక్షుడు ఒక సర్కులర్ జారీ చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఎవరూ మాట్లాడవద్దని.. అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఆ యుద్ధానికి తాత్కాలిక ముగింపు మాత్రమే ఆయన ఇచ్చారు..ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేసిన తర్వాత కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఒక్క మాట కూడా మాట్లాడ లేదు. అతని అనుచరులు కూడా సైలెంట్ అయిపోయారు.. ఆ తర్వాత బోనాల వేడుకలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పాల్గొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి కూడా ఉన్నారు. ఇద్దరు కలిసి భోజనం కూడా చేశారు. ఒకానొక దశలో ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. దానిపై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో తెలంగాణ



ప్రాంతానికి చెందిన పార్లమెంట్ సభ్యులు భేటీ అయ్యారు. వీరిలో డీకే అరుణ, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్, గోడం నగేష్, ధర్మపురి అరవింద్, విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న సికింద్రాబాద్ ఎంపీ, కరీంనగర్ ఎంపీ ఇందులో కనిపిం చలేదు.. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి వీరంతా కూడా ఢిల్లీలో ఉన్నారు.విశ్వేశ్వర్ రెడ్డి పార్లమెంట్ విప్ గా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులకు ఢిల్లీలోని ఆయన తన అధికారిక గృహంలో విందు కూడా ఇచ్చారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. కిషన్ రెడ్డి సౌమ్యుడు కాబట్టి.. ఆయన గురించి పెద్దగా ప్రస్తావన ఉండడం లేదు.. కానీ ఎటొచ్చీ బండి సంజయ్ గురించే చర్చ నడుస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి మిగతా ఎంపీలకు మధ్య గ్యాప్ ఉందని.. అందువల్లే ఆయనను విశ్వేశ్వర్ రెడ్డి పిలవలేదని కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారం చేస్తున్నాయి. అంతేకాదు పార్టీలో ఎంపీలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి అంతరం పెరిగిపోయిందని.. ఈటెల రాజేందర్ కు మిగతా ఎంపీల సపోర్టు ఉందని.. అందువల్లే ఈ ఫోటోలు బయటికి వచ్చాయని ప్రచారం నడుస్తోంది. అయితే దీనిపై భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా విభాగం స్పందించే లోగానే జరగాల్సిన ప్రచారం జరిగిపోయింది.. వివరణ ఇచ్చే లోగానే వ్యతిరేక ప్రచారం జోరందుకుంది. 8 మంది పార్లమెంట్ సభ్యులను గెలుచుకొని.. అసెంబ్లీ ఎన్నికల్లో పర్వాలేదు అనుకునే స్థాయిలో సీట్లు సాధించుకొని.. కొన్ని జిల్లాలలో పట్టు సాధిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఇలా అంతర్గత లుకలుకలతో ఇబ్బంది పడడం.. సోషల్ మీడియాలో చర్చనీయాంశం కావడం పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతోంది. మరి ఈ పరిణామాలకు రామచంద్రరావు ఎలా చెక్ పెడతారో చూడాల్సి ఉంది.

# ఇంటినెంబర్లతో రిజిస్ట్రేషన్స్

**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. అక్రమ రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి, పారదర్శకతను పెంచడానికి ఇంటి కొలతలు, విస్తీర్ణం, ఎన్వోసీ వంటి నిబంధనలు తప్పనిసరి చేశారు. ఈ నిర్ణయంతో గ్రామాల్లో క్రయవిక్రయదారులకు ఊరట లభించింది. అయితే, పురపాలికలు, నగరపాలికల్లో, ముఖ్యంగా కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండితో పాటు కొత్తపల్లి, రేకుర్తిలోని 200 సర్వే నంబర్లలో ఇంకా రిజిస్ట్రేషన్లపై స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులు ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతోపాటు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లకు చేరాయి. ఇళ్ల క్రయవిక్రయాలు జరిపే క్రమంలో రిజిస్ట్రేషన్ల సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విక్రయించే ఇంటిని పరిశీలించి, ఇంటి విస్తీర్ణం కొలతలు, నాలుగు వైపులా ఉన్న వారి వివరాలు, స్లాబ్ ఏరియాతోపాటు సంబంధిత డాక్యుమెంట్లతో కూడిన ఎన్వోసీ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యలు అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసి, పారదర్శకతను పెంచేందుకు ఉద్దేశించినవి అన్నారు.కాగా, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిన అధికారులు, పురపాలికలు, నగరపాలికల్లో మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కరీంనగర్ నగరపాలిక, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు సంబంధించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, రేకుర్తిలోని దాదాపు 200 సర్వే నంబర్లలో భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ నిషేధంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆస్తులను క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.



గ్రామాల్లో తీసుకున్న సానుకూల నిర్ణయం పురపాలికలు, నగరపాలి కలకు కూడా వర్తింపజేయాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇక గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సారంగాపూర్, రాయికల్ మండలాల్లో అత్యధిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవుల మధ్య నుంచే పలు రహదారులు వెళ్తాయి. గతంలో ప్రభుత్వం ఈ గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టినా, అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కొంతకాలంగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ, ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడం లేదు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరగా అనుమతులు మంజూరు చేసి, నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

## కేంద్రం మెడలు వంచుతాం

-మొదటిపేజీ తరువాయి

బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి.. ఇప్పుడు మరో మాట మాట్లాడుతున్నారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను ఎందుకు తొలగించడం లేదు? ఆయా రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాకే భాజపా నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి.

**మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు**

కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారు. స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే మేం ముందుకెళ్తున్నాం. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతాం. మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని భాజపా చూస్తోంది. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారు. రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతాం.

**దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి**

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం నిబంధన దాటిపోయింది. దాని విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోంది? ఓబీసీలకు న్యాయం చేయాలని భాజపాని కోరుతున్నా. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోంది. గతంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారు. ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారు. బీసీ అయిన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి"అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి


ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన,ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మా ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టిన రోజున అసెంబ్లీ ఆవరణలో ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి అయ్యాయి..దాని విలువ 6680 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్న ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మా ప్రభుత్వం ముందుకు పోతుంది. ఆర్టీసీ లో మహిళలకు బస్సులు కొనుగోలు చేసి యజమానులను చేసింది. వారి చేత పెట్రోల్ బంకులు పెట్టించడం జరిగింది. ఆర్టీసీలో ఎవరు ఎక్కడికి వెళ్లాలన్న ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. గతంలో ఆర్టీసీ నిర్వీర్యం అయి ప్రైవేట్ పరం అవుతుందని అన్నారు..కానీ లాభాల్లోకి వచ్చేలా చేశాం. హ్యామ్ విధానంలో ప్రతి గ్రామం నుండి మండలానికి మండల నుండి జిల్లా కేంద్రానికి కొత్త డబుల్ రోడ్లు వచ్చే నెలలోనే ప్రారంభిస్తున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న మా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు.

## తెలంగాణకు భారీగా రైల్వే ప్రాజెక్టులు



**వరంగల్ :** ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు రవాణా రంగం కీలకం. అందులో రైల్వే కనెక్టివిటీ ఎంతో ప్రాముఖ్యమైన రవాణా సౌకర్యం. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా ముందుగు సాగుతోందనే చెప్పాలి. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయి. అయితే, నిధుల కేటాయింపు సరిగా జరగడం లేదని, నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రైల్వే లైన్లు, త్వరలో పూర్తి కానున్నవి, ప్రతిపాదన దశలో ఉన్నవి, సామర్థ్యం పెంచుతూ తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణ రవాణా రంగ చిత్రపటాన్ని మార్చే అవకాశం ఉంది. వరంగల్ జిల్లాలో రూ. 500 కోట్లతో నిర్మిస్తున్న అత్యాధునిక రైల్వే కోచ్‌ల తయారీ కర్మాగారం తెలంగాణలోని యువతకు ఉపాధి కల్పించే దిశగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కర్మాగారాన్ని ఇటీవల సందర్శించిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మెగా అత్యాధునిక కర్మాగారంగా అభివర్ణించారు. దీనికి సంబంధించిన సివిల్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి పూర్తవుతాయని, ఉత్పత్తి 2026లో ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందులో వందే భారత్ రైలు కోచ్‌లు, రైలు ఇంజన్లు, సరకు రవాణా వ్యాగన్లు ఉత్పత్తి చేస్తారు. భవిష్యత్తులో మెట్రో రైల్ కోచ్‌లు కూడా తయారు చేయవచ్చని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. రానున్న రోజుల్లో కాజీపేట రైల్వే కోచ్ కర్మాగారం స్థానిక యువతకు ఉపాధి కేంద్రంగా మారవచ్చు.భారతీయ రైల్వే వ్యవస్థలో వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టడం ఓ విప్లవాత్మక మార్పుగా అభివర్ణించవచ్చు. ప్రయాణికుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. ఈ రైళ్లలో ప్రయాణించడానికి ప్యాసెంజర్స్ చాలా ఇష్టపడుతున్నారు. వారి డిమాండ్ మేరకు రైల్వే శాఖ వందే భారత్ రైళ్ల సామర్థ్యాన్ని పెంచడానికి నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ – విశాఖపట్నం వందే భారత్ రైలు 16 బోగీలతో నడిచేది. దీన్ని ఇప్పుడు 20 బోగీలకు పెంచారు. కాచిగూడ – యశ్వంత్‌పూర్ (బెంగళూరు) వందే భారత్ రైలు 8 కోచ్‌లతో ప్రయాణించేది. దీన్ని ఇప్పుడు 16 కోచ్‌లకు పెంచారు. దీంతో పాటు, సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ రైలును ఏలూరు, సామర్లకోటలో స్టాపేజీలను మరో ఆరు నెలలపాటు పొడిగించే నిర్ణయం రైల్వే శాఖ తీసుకుంది. దీంతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇది ఎంతో ప్రయోజనకారి అవుతోంది. ప్రజల నుంచి వచ్చిన అనూహ్య స్పందన, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన డిమాండ్లు, ఈ స్టేషన్లలో గణనీయంగా పెరిగిన టికెట్ల ఆదాయం కారణంగా రైల్వే శాఖ ఈ రెండు స్టేషన్లలో అదనపు స్టాపేజీలను ఆరు నెలలు పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఏలూరు, సామర్లకోట నుంచి హైదరాబాద్ లేదా విశాఖపట్నం వెళ్లాలనుకునే ప్రయాణికులు నేరుగా వందే భారత్ రైలు ద్వారా తక్కువ సమయంలో గమ్య స్థానం చేరే అవకాశం ఉంది.తెలంగాణలో కొత్త రైల్వే సేవలను ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. హైదరాబాద్ – జోధ్‌పూర్ మధ్య కొత్తగా రోజు వారీ రైలు సౌకర్యాన్ని జులై 19 వ తేదీన ప్రారంభించారు. ఈ రైలు సేవ కల్పించాలని చాలా కాలం నుంచి హైదరాబాద్‌లోని రాజస్థానీ కమ్యూనిటీ కోరుతోంది. దీంతో పాటు, ఘట్ కేసర్– యాదాద్రిగుట్ట ఎం.ఎం.టి.ఎస్. విస్తరణకు అడుగులు పడుతున్నాయి. 2016లో మంజూరయిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం వంద కోట్లు కేటాయించారు. ఇక కొత్త రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనల విషయానికి వస్తే ఔటర్ రింగ్ రోడ్ రైల్ ముఖ్యమైన ప్రాజెక్టుగా చెప్పవచ్చు. తెలంగాణ రీజనల్ రింగ్ రోడ్‌కు సమాంతరంగా 392 కిలోమీటర్ల ప్రతిపాదించిన ఈ రైల్వే ప్రాజెక్టుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే కూడా మంజూరయింది. రూ. 12,408 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగరానికి, తెలంగాణ రాష్ట్రానికి ఓ గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పడం విశేషం. ఇక హైదరాబాద్ – అమరావతి కొత్త రైలు మార్గంకు సంబంధించి భూసేకరణ పనులు జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లాలోని నంబూరు వరకు ఈ మార్గాన్ని నిర్మిస్తారు. రూ. 2245 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. భూసేకరణ పనుల్లో కొంత జాప్యం ఉందన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భూమిని రైల్వే శాఖకు అప్పజెప్పగానే నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని రైల్వే శాఖ చెబుతోంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265



# రాత్రిపూట నోరు ఎండిపోతుందా?

చాలా సార్లు, నిద్రలో నోటిలో పొడిబారడం, జిగటగా అనిపించడం జరుగుతుంది.. ఇది కేవలం డీహైడ్రేషన్ వల్ల మాత్రమే కాదు. ఈ నిరంతర సమస్య అనేక తీవ్రమైన వ్యాధులను కూడా సూచిస్తుంది. రాత్రిపూట నోరు ఎండిపోవడాన్ని వైద్య భాషలో జిరోస్టోమియా అంటారు.. లాలాజల ఉత్పత్తి తగ్గి నోటిలో జిగురు ఏర్పడినప్పుడు ఇది జరుగుతుంది. నిద్రలో, మన శరీరం సాధారణం కంటే తక్కువ లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తుంది.. కానీ ఈ సమస్య కొనసాగితే, అది సమస్యను మరింత పెంచుతుంది. దీనికి శరీరంలో సరిగా నీరు లేకపోవడం, నోరు తెరిచి నిద్రపోవడం, కాఫీ లేదా ఆల్కహాల్ అధికంగా తీసుకోవడం.. కొన్ని మందుల దుష్ప్రభావాలు, హార్మోన్ల మార్పులు వంటి అనేక కారణాలు ఉండవచ్చు. ఎక్కువసేపు నోరు ఎండిపోవడం వల్ల దంతక్షయం, నోటి పూతలు, దుర్వాసన వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల, దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవడం.. సకాలంలో చికిత్స పొందడం చాలా ముఖ్యం. రాత్రిపూట తరచుగా నోరు ఎండిపోవడంతో పాటు ఇతర లక్షణాలు కూడా కనిపించవచ్చు. ఇందులో నాలుకపై మంట లేదా గరుకుగా అనిపించడం, మాట్లాడటం.. మింగడంలో ఇబ్బంది, పెదవులు పగిలిపోవడం, నోటి నుంచి దుర్వాసన వంటివి ఉంటాయి. కొన్నిసార్లు రుచిని అనుభవించే సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. లాలాజలం బ్యాక్టీరియాను తొలగించడానికి పనిచేస్తుంది కాబట్టి, నోరు నిరంతరం పొడిబారడం దంతాలు, చిగుళ్ళలో ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతుంది. గొంతు నొప్పి, అధిక దాహం, నిద్రలో తరచుగా మేల్కొనడం కూడా దాని ఇతర లక్షణాలు.. ఈ లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగితే, అది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. రాత్రిపూట నోరు పొడిబారడం ఏ వ్యాధులను సూచిస్తుంది? రాత్రిపూట నోరు ఎండిపోవడం అనేక వ్యాధులకు సంకేతం కావచ్చు.. డయాబెటిస్ దీనికి ఒక సాధారణ కారణం.. దీనిలో రక్తంలో చక్కెర స్థాయి పెరగడం వల్ల శరీరంలో నీటి లోపం ఏర్పడుతుంది. థైరాయిడ్ సమస్యలలో లాలాజలం ఉత్పత్తి కూడా తగ్గుతుంది. స్లీప్ అప్నియాతో బాధపడేవారు తరచుగా నోరు తెరిచి నిద్రపోతారు.. ఇది ఈ సమస్యను మరింత పెంచుతుంది. స్జోగ్రెన్స్ సిండ్రోమ్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులలో, లాలాజల గ్రంథులు ప్రభావితమవుతాయి. ఇది నోరు పొడిబారడానికి కారణమవుతుంది. వీటితో పాటు, డీహైడ్రేషన్, శ్వాసకోశ అలెర్జీలు లేదా ఇన్ఫెక్షన్లు, యాంటిహిస్టామైన్లు, యాంటిడిప్రెసెంట్స్, రక్తపోటు మందులు వంటి కొన్ని దీర్ఘకాలిక మందులు కూడా ఈ సమస్యకు కారణమవుతాయి.

# మునగాకు నీరు తాగడం వల్ల ఇన్ని లాభాలా..?





మునగాకు దాని సూక్ష్మపోషకాల కారణంగా ఆహారంగా, ఔషధంగా రెండు రకాలుగా పురాతన కాలం నుండి ఉపయోగించబడుతోంది. ఉదయాన్నే పరగడుపున మునగాకు టీ తీసుకుంటే శరీరంలోని వివిధ వ్యాధులు, పోషక లోపాలను తొలగించడానికి బెస్ట్ మెడిసిన్‌లా ఉపయోగపడుతుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మునగాకు నీరు జీవక్రియను మెరుగుపరుస్తుంది. తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. డయాబెటిక్ రోగులకు, ప్రీ డయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. మునగాకులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. మునగాకులో అవసరమైన విటమిన్లు (ఎ, సి, ఇ), ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, ఇనుము) యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి. ఇది ఎముక సాంద్రత, బోలు ఎముకల వ్యాధి నివారణకు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. మునగాకులోని నేచురల్ డిటాక్సిఫైయింగ్ గుణాలు కాలేయం, మూత్రపిండాల పనితీరుకు సహాయపడతాయి. శరీరాన్ని నిర్విషీకరణ చేస్తాయి. శక్తి స్థాయిలను పెంచుతాయి. థైరాయిడ్‌ను రెగ్యులేట్ చేసే న్యాచురల్ మెడిసిన్ మునగాకు. మునగాకు నీరు జీవక్రియను మెరుగుపరుస్తుంది. తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. డయాబెటిక్ రోగులకు, ప్రీ డయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. విటమిన్ ఇ, ఇనుము సమృద్ధిగా ఉన్న మునగాకు ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తుంది. మొటిమలను తగ్గిస్తుంది,. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఐరన్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా రక్తహీనత చికిత్సకు సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు శరీరంలో వివిధ సమస్యలు తలెత్తడం ప్రారంభిస్తాయి. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. పాల నుంచి లభించే క్యాల్షియం, పెరుగు నుంచి పొందే ప్రోటీన్లను మునగాకు నుంచి పొందవచ్చు

# రోజుకొక్కటి తిన్నా రోగాలన్నీ పరార్!



ఆరోగ్యానికి మేలు చేసే మొక్కల్లో వాము ఆకు మొక్క ఒకటి. వాము ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. దీనిని సాంబార్ సోప్పు, సాంబార్ బల్లి, సాంబ్రాణి ఏలే, కర్పూరవల్లి వంటి వివిధ పేర్లతో పిలుస్తారు. దీని ఆకులు లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ప్రకృతిలో ఆరోగ్యానికి మేలు చేసే అనేక ఔషధ మొక్కలు, మూలికలు ఉన్నాయి. అయితే మనం వాటిపై అంతగా శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇటువంటి ఆరోగ్యానికి మేలు చేసే మొక్కల్లో వాము ఆకు మొక్క ఒకటి. వాము ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. దీనిని సాంబార్ సోప్పు, సాంబార్ బల్లి, సాంబ్రాణి ఏలే, కర్పూరవల్లి వంటి వివిధ పేర్లతో పిలుస్తారు. దీని ఆకులు లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ఇందులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ప్రోటీన్లు, శరీరానికి చాలా ప్రయోజనకరమైన పలు రకాల ఖనిజాలు కూడా ఉన్నాయి. ఈ ఆకులు జలుబు, దగ్గు వంటి కాలానుగుణ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. అందుకే చాలా మంది దీన్ని ఇంటి పెరట్లో పెంచుకుంటూ ఉంటారు. ఈ ఆకులను ఆయుర్వేద మందులలోనూ ఉపయోగిస్తారు. వాకు ఆకు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దీని వినియోగం కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. వాము ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కళ్ళ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ ఆకు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. రోజూ రెండు పెద్ద ఆకులను నమిలి తినడం వల్ల శరీర జీవక్రియ రేటు పెరుగుతుంది. వాము ఆకులను తేనె, వెనిగర్ తో కలిపి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. ఈ ఆకులను తినడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్యలు కూడా తగ్గుతాయని చెబుతారు. వీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను సమతుల్యం చేస్తాయి. ఐరన్ లోపం ఉన్నవారు వాము ఆకులను తినవచ్చు. ఇది రక్తహీనతను నయం చేయడంలో సహాయపడుతుంది.

# ఇలా నానపెట్టిన నీరు తాగితే.. అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు!



గుమ్మడి.. ఒకప్పుడు కేవలం దిష్టి కోసం మాత్రమే వాడే గుమ్మడికాయ ఇప్పుడు మంచి పోషకాహారంగా ప్రసిద్ధికెక్కింది. గుమ్మడికాయ జ్యూస్‌లు, వడియాలు, కూరగా కూడా చేసుకుని తింటున్నారు చాలా మంది. అలాగే, గుమ్మడికాయ గింజలు కూడా ఎక్కువ మంది ఆహారంలో భాగంగా తీసుకుంటున్నారు. గుమ్మడికాయతో పాటుగానే గింజలు కూడా రెట్టింపు ఆరోగ్యాన్ని అందిస్తాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ స్పూన్ గుమ్మడి గింజలు తినటం వల్ల బోలెడన్నీప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే,ఈ గుమ్మడి గింజలను రాత్రి నీళ్లలో నానాబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగటం వల్ల అంతే ప్రయోజనం ఉందంటున్నారు నిపుణులు. గుమ్మడి గింజల్లో అనేక పోషక విలువలు ఉంటాయి. వాటిని నానపెట్టిన నీరు తాగితే అనేక ప్రయోజనాలు పొందొచ్చునని పోషకాహార, వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల నీరు కొలొస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. బీపీని కంట్రోల్ చేస్తుంది. గుండె ఆరోగ్యానికి మంచిది. గుమ్మడి గింజలు ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్లు (ముఖ్యంగా విటమిన్ కె, ఈ) ఖనిజాలు (మెగ్నీషియం, జింక్ వంటివి)తో నిండి ఉంటాయి. గుమ్మడికాయ గింజల్లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తపోటును తగ్గించి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. గుమ్మడి గింజల నీటిలో యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. దీంతో బాడీలో ఇమ్యూనిటీ పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుంది. గుమ్మడి గింజల నీటిలో ట్రైటోఫాన్? ఉంటుంది. ఇది మంచి నిద్రకు చాలా అవసరం.గుమ్మడి గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది మీ జీర్ణక్రియ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. గుమ్మడి గింజల నీటితో శరీరానికి అనేక విటమిన్లు లభిస్తాయి. గుమ్మడి గింజలను రాత్రంతా నానపెట్టండి. లేదా కనీసం ఆరు గంటలైన నానపెట్టి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గుమ్మడికాయ గింజల్లో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీంతో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.మెదడు వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలో గుమ్మడికాయ గింజలు సహాయపడతాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. శరీరానికి ఎక్కువ శక్తిని ఇస్తాయి.

# వేడి వేడిగా ఉన్న ఆహారం తింటున్నారా!



చాలా వేడి వేడిగా ఉండే ఫుడ్ తినడం ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. చాలా మంది ఎంతో ఇష్టంగా వేడి వేడి రైస్ లేదా ఇతర ఆహారపదార్థాలు తింటుంటారు. మరీ ముఖ్యంగా వర్షాకాంలో ఎక్కువ మంది వేడి వేడి ఆహారం తినడానికే ఎక్కవ మక్కువ చూపిస్తారు. కానీ ఇలా వేడి ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. చాలా వేడి వేడిగా ఉండే ఫుడ్ తినడం ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. చాలా మంది ఎంతో ఇష్టంగా వేడి వేడి రైస్ లేదా ఇతర ఆహారపదార్థాలు తింటుంటారు. మరీ ముఖ్యంగా వర్షాకాంలో ఎక్కువ మంది వేడి వేడి ఆహారం తినడానికే ఎక్కవ మక్కువ చూపిస్తారు. కానీ ఇలా వేడి ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఇప్పుడు మనం దాని గురించే తెలుసుకుందాం. 65 డిగ్రీల కంటె ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న ఆహార పదార్థాలు లేదా పానీయాలు తీసుకోవడం వలన అనేక సమస్యలు ఎదురు అవుతాయంట. మరీ ముఖ్యంగా అన్న వాహికలోని సన్నని పొర కాలిపోతుందంట. దీని వలన భవిష్యత్తులో అనేక సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లో అతిగా వేడి ఉండే ఆహారాలు తీసుకోకూడదంటున్నారు ఆరోగ్య నిపుణులు. అదే విధంగా కొన్ని సార్లు వేడి వేడి ఆహారం లేదా టీ, కాఫీ వంటి డ్రింక్స్ తాగుతున్నప్పుడు నాలుక లేదా కడుపులో వేడిగా, కాలి నట్లుగా అనిపిస్తుంది. ఇలాంటి సమయంలో మరోసారి అస్సలే వేడి ఫుడ్ తీసుకోకూడదంట. దీని వలన కడుపులో మంట కణజాలంలో మార్పులు సంభవించి, క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉన్నదంట. కొన్ని సార్లు వేడి వేడి అన్నం తినాలంటే ఇబ్బంది ఏర్పడుతుంది. ముఖ్యంగా నాలుక చాలా సున్నితంగా కాలినట్లు అనిపించడంతో ఆహారం తీసుకోవడం కష్టమవుతుంది. అయితే అలాంటి సందర్భాల్లో వేడి వేడి అన్నం అస్సలే తీసుకోకూడదంట. ఇది మీ శరీరానికి ఒక హెచ్చిరికగా భావించాలంట. లేకపోతే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట. అలాగే చాలా మందికి ధూమపానం, మద్యపానం చేయడం అలవాటు ఉంటుంది. అయితే అలాంటి వారు అస్సలే వేడి వేడి ఆహారం తీసుకోకూడదంట. దీని వలన నోటిలోని శ్లేష్మ పొర పొగాకు వలన ప్రభావితం అవుతుంది. అటువంటి సమయంలో వేడి వేడి ఆహారం తీసుకోవడం వలన సమస్య మరింత ఎక్కువ అయ్యి నోటి క్యాన్సర్ వచ్చే ఛాన్స్ ఉంటుందంట.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**సమస్యల సాధనకు మూడు దశల ఉద్యమం...**
**తహసిల్దార్ కు మెమోరండము సమర్పించిన ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ...**

తొలి అడుగు ప్రతినిధి జులై 23. హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్



దశబ్ద కాలంగా ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు అనేకం పెండింగ్లో ఉన్నప్పటికిని ప్రభుత్వము స్పందించకపోవడం వలన ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు జే.ఏ.సీగా ఏర్పడి ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించిన ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వలన తిరిగి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మూడు దశల ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులకు రావలసిన మెడికల్ బిల్లులు,, జిపిఎఫ్ బిల్లులు పెండింగ్లో ఉండి ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వము పట్టించుకోకపోవడం శోచనీయమని వెంటనే పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలని కరీంనగర్ జిల్లా డీటీఎఫ్ అధ్యక్షులు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయుల పోరాట కమిటీ మూడు దశల పోరాటాన్ని చేపట్టినదని ఆగస్టు 23,24 తారీఖులలో మండల తాసిల్దార్ల ద్వారా ముఖ్యమంత్రి కి వినతి పత్రం సమర్పించడం. ఆగస్టు 1వ తారీఖున జిల్లా కేంద్రాలలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం. ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం కార్యక్రమాలను చేపట్టిన దృష్ట్యా ఉపాధ్యాయ సంఘాలన్నీ ఈ ధర్నాలో పాల్గొంటూ మద్దతు తెలిపాలని, సమస్యల పరిష్కారం కొరకు చేసే పోరాటంలో అందరూ పాల్గొనాలని, టి.పి.టి.ఎఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి అవినాష్ ఉపాధ్యాయ మిత్రులను కోరారు. జమ్మికుంట మండల తాసిల్దార్ కు మెమొరండం సమర్పించిన ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి.డిటిఎఫ్ మండల అధ్యక్షులు బి.వేణుమాధవ్ జనరల్ సెక్రెటరీ రాజేందర్ టి.పి.టి.ఎఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి అవినాష్ టి. పి.టి.ఎఫ్ జమ్మికుంట మండల జనరల్ సెక్రెటరీ కుమారస్వామి, పోతుల రాజయ్య, జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో అత్యధిక జిల్లా పరిషత్, మండల పరిషత్‌లను గెలుస్తాం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- పాలమూరులో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం
- పాల్గొన్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుంది
- ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఎండగట్టండి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చనందుకు వారు ఓట్లు అడగాలంటే బయపడ్తున్నారు





తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్

రాబోయే స్థానిక ఎన్నికలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుండి అధిక ఎంపీటీసీలు జడ్పిటిసిలు గెలిచి జిల్లా పరిషత్ చైర్మన్ లను, ఎంపీపీలను అధిక సంఖ్యలో చేజిక్కించుకోవాలని స్థానిక నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కొరకు నాయకులతో కార్యకర్తలతో, విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యకర్తలను నాయకులను ఉద్దేశిస్తు పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రావాలంటే స్థానిక ఎన్నికల్లో నాయకులు సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎంపిటిసిలుగా జడ్పీటీసీలుగా గెలచి జిల్లా పరిషత్ చైర్మనులుగా, ఎంపీపీలుగా అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పదవులను అధిరోహించాలని విస్తృత స్థాయి సమావేశంలో నాయకులతో కార్యకర్తలతో మాట్లాడారు.అంతే కాకుండా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిచేయడంలో పూర్తిగా విఫలమైందని గ్రామాలలో స్థానిక నాయకులు ఓట్లు అడగాలంటే భయపడుతున్నారని ఎలక్షన్ లో ఇచ్చిన హామీలలో తులం బంగారం, స్కూటీలు,కౌలు రైతులకు రైతుబరోస, మహిళలకు 2500, 4000 పింఛన్లు మొదలైన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, గ్రామాలలో ప్రజలను ఏ రకంగా ఓట్లు అడగాలో తెలియని స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని వారి వైఫల్యాలను గ్రామాలలో ఎండగట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వము ఏర్పాటు అయి 18 నెలలు పూర్తయిన కూడా జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైనా పనులనే చేస్తున్నారు తప్పా ఇంకా కొత్త పనులు చేయడం లేదని వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలన్నీ 18 నెలలు పూర్తయిన కూడా అమలు చేయడం లేదని ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు స్థానిక ఎన్నికల్లో వివరించాలని కార్యకర్తలకు,నాయకులకు విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పాలమూరు నియోజవర్గ మాజీ జడ్పిటిసిలు,ఎంపిపిలు మున్సిపల్ చైర్మన్లు, ఎంపిటిసిలు,సర్పంచులు

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**చటాన్ పల్లి గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాజేందర్ రెడ్డి- కర్ణకోట అంజి ముదిరాజ్**

**శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు మరియు అభిమానులు**

**చేగూరి రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం**

**ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు,బ్రెడ్లు పంపిణీ**



తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్ :

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేగూరి రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా షాద్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం నాడు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ, మరియు బ్రెడ్లు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ షాద్నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్ పల్లి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయ సహకారాలతో ముందుకు తీసుకుపోతున్న నాయకుడు రాజేందర్ రెడ్డి అని కొనియాడారు నిత్యం అహర్నిశలు ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తూ పనులు చేస్తున్నారని రాబోయే రోజులలో చటాన్ పల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోతున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఎక్కడైనా సమస్య ఉందంటే వెంటనే స్పందించే తత్వం రాజేందర్ రెడ్డి దని గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నందుకు తన జీవితమంతా ప్రజలకే అంకితం చేసే విధంగా పనులు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇటువంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆ భగవంతు ప్రార్థిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు మరియు అన్నదాన కార్యక్రమం తో పాటు పేదలకు పండ్ల పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంకల చెన్నయ్య ముదిరాజ్,కర్ణకోట అంజి ముదిరాజ్,సి హెచ్. కుమార్,రవికుమార్ కర్ణకోట ధనరాజ్,గడ్డమీద రమేష్, శ్రీనివాసరెడ్డి,సున్నం రాజు,శ్రీకాంత్ రెడ్డి,కుమార్ యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 19 వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభం



తొలి అడుగు ప్రతినిధి జులై 23. హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి 19వ వార్డులో 5 లక్షల రూపాయల తో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ మున్సిపల్ వైస్ చెర్మన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ ఈ నిధులు కరీంనగర్ జిల్లాకు అప్పటి ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో నిధులు మంజూరుకు ఇవ్వడం జరిగింది. మా ప్రాంతం ప్రజల తరఫున హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు కు ప్రత్యేక ధన్యవాదములు చాలా కాలం నుండి ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ రోడ్డు వేయాలని మా దృష్టికి మా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారు ఈ రోడ్డుతో ఈ ప్రాంతానికి చాలా సౌకర్యంగా మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఉంటుంది ఎమర్జెన్సీ ఉన్నప్పుడు అంబులెన్స్ గానీ కార్లు గాని ట్రాక్టర్లు గాని రావడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు కావున ఈ రోడ్డు మంజూరు పట్ల మా ప్రాంత ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టాన అధ్యక్షుడు సుంకరి రమేష్ , ఎర్రం సతీష్ రెడ్డి , ఎలగందులశ్రీహరి , పిట్టల రమేష్ , ఉడుత వెంకటేష్ , సంకిస సురేష్ , రాజ్ కుమార్, రామచంద్రం , శ్రీను ,ఆడెపు రాయనర్స్, ఎండి ఖాదర్ , ఎండి రహీం,రాజ కొమురయ్య , చక్రపాణి ,ఇస్మాయిల్ ,జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలు భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు**

తొలిఅడుగు ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం:



మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గం లోనీ అన్ని మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని,దానికి సంబంధించి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసుకోవాలని,వర్షాకాలం వలన విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున,ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు బుధవారం రోజున 5 మండలాల ఎంపీడీవోలు , హుజురాబాద్ , జమ్మికుంట మునిసిపల్ కమిషనర్ లతో మాట్లాడి తగిన సూచనలు చేశారు.రైతులు వ్యవసాయానికి వెళ్ళే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని,కరెంట్ స్తంభాలు ఇతరత్ర సరి చూసుకోవాలనీ కోరారు.

## స్వేరోస్ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా ఆకినపల్లి ప్రవీణ్

తొలిఅడుగు ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం:



అక్షరం,ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే అంశాలతో కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాకుండా దేశం నలుమూలల విస్తరిస్తూ అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని ఆత్మగౌరవంతో బ్రతకాలి అని గొప్ప ఉద్దేశంతో స్వేరోస్ నెట్వర్క్ ను స్థాపించిన మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పిన మాటలని నిత్యం అనుసరిస్తూ ప్రతినిత్యం తన అడుగుజాడల్లో నడుస్తూ గ్రామ గ్రామాన ఎవరెవరికి ఏ అవసరాలు ఉన్నాయో తెలుసుకుంటూ ప్రతి సమస్యకి పరిష్కారం చూపిస్తున్న గొప్ప నెట్వర్క్ లో ఈరోజు నిర్వహించిన జిల్లా కమిటీలో తనదైన శైలిలో స్వేరోస్ నెట్వర్క్ ని విస్తరిస్తున్న ఆకినపల్లి ప్రవీణ్ కి జిల్లా అధికార ప్రతినిధి పదవి రావడం చాలా సంతోషంగా ఉంది అని కమిటీని ఏర్పాటు చేసిన స్వేరో రాష్ట్ర కో కన్వీనర్ గడప రాజు మరియు సీనియర్ స్వెరో నాయకులు ఎర్ర రాజు అన్నారు.. స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షునిగా జెట్టిపల్లి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..ఈ సందర్భంగా స్వేరోస్ ఫౌండర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఆకినపల్లి ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏసీపీ మాధవి కుటుంబాన్ని పరామర్శించిన పొనగంటి మల్లయ్య

తొలిఅడుగు ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం :




ఇటీవల హుజురాబాద్ ఎసిపి మాధవి భర్త కరీంనగర్ పిటిసి ప్రిన్సిపల్, డీఎస్పీ మహేష్ గుండెపోటుతో మృతి చెందాగ . కరీంనగర్ లోని ఏసీపీ మాధవి నివాసంలో వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి , చిత్రపటానికి నివాళ్లు అర్పించిన జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొనగంటి మల్లయ్య మరియు మాజీ కౌన్సిలర్స్ దేశిని సదానందం, పొన్నగంటి సారంగం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్, పాతకాల ప్రవీణ్, తదితరులు .

తొలి అడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు అసెంబ్లీలో చర్చిస్తా





**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. షాద్ నగర్ ఆర్టీసీ డిపోకు 53 కొత్త బస్సులు ఇప్పించా**

**షాద్ నగర్ నియోజక వర్గంలో 1కోటి 62 లక్షల 9,200 వేల పైచిలుకు మంది ప్రయాణికులు తిరిగారు**

**షాద్ నగర్ డిపోకు 7 కోట్ల 43లక్షల ఆదాయం.. సహకారం అందిస్తా.. సంబరాలు చేయిస్తా..**

**ఆర్టీసీ కార్మికులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంబరాలు..**

**బస్సు లేని గ్రామాలకు బస్సులు నడపాలని అధికారులకు సూచన..**

**ఆరడుగుల పొడవున్న ఓ హౌలే గాడు ఆర్టీసీని బాగు చేయాలంటూ చెప్పడం విచిత్రం**

తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్ :

ఆర్టీసీ ఉద్యోగులకు, కార్మికులకు ఓ సోదరుడిలా అండగా ఉంటా.. వారిచేత ఎన్నెన్నో సంబరాలు చేయిస్తా.. కానీ మా నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు బస్సులు నడపండి.. అదే మీరు నాకు ఇచ్చే కానుక.. అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వ ఆర్టీసీ శాఖ సంబరాలు అధికారులకు సూచించారు. షాద్ నగర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లో జరిగిన ఆర్టీసీ సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దీనస్థితిలో ఉన్న ఆర్టీసీ డిపోలను సంబరాలు చేసే స్థాయికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ల ఆధ్వర్యంలో ఇది సాధ్యపడిందని అన్నారు. తెలంగాణ పోరాటంలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మర్చిపోలేనిదని, కానీ గత ప్రభుత్వం వాళ్ల సంక్షేమాన్ని మరిచిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అండగా నిలిచిందని స్పష్టం చేశారు. నిత్యం ప్రయాణికుల మధ్యన ఉంటూ వారితో కలిసి ప్రయాణించే డ్రైవర్లు, కండక్టర్లు సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలు ఎప్పటికీ గుర్తు ఉంటాయని పేర్కొన్నారు. గతంలో వారి సమస్యలు వింటే బాధగా ఉండేదని, ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేని స్థాయికి గత ప్రభుత్వం వారిని దిగజార్చిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో అలాంటి పరిస్థితి ఉండదని కార్మికుల సమస్యలు, టి ఎ లు డీఎల వంటివి అసెంబ్లీలో చర్చించి సాధించేందుకు కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల కళ్ళల్లో సంతోషం.. ఇళ్లల్లో భోగభాగ్యాలే తన లక్ష్యమని అన్నారు. మాయమాటలు చెప్పే పార్టీల ఎత్తుగడలకు లొంగవద్దని గత ప్రభుత్వం ఆర్టీసీకి ఏం చేసింది, ప్రస్తుత ప్రభుత్వం ఏం చేస్తుంది అన్నది ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు ఏమున్నా తనతో చెప్పాలని కోరారు. అయితే ఆర్టీసీ కి నిరంతరం తను అండగా ఉంటానని, అందుకు ప్రతిఫలంగా ఆర్టీసీ అధికారులు తాను కోరిన ఐదు నుంచి పది గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. మంత్రి పున్నం ప్రభాకర్ ఆర్టీసీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని, భవిష్యత్తులో ఆర్టీసీ సంస్థ ఎవరు ఊహించని స్థాయికి వెళుతుందని అన్నారు. ఆర్టీసీ మన కూడా కోసం డిపోలో 53 బస్సులు కొత్తవి తీసుకువచ్చానని, నియోజకవర్గంలోని 300 గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవాలని కోరారు. రాష్ట్రంలోని 97 డిపోలలో 341 బస్టాండ్ల ద్వారా 6700 కోట్ల ఆదాయాన్ని ఆర్టీసీ యేటా పొందుతుందని వివరించారు. షాద్ నగర్ ఆర్టీసీ డిపోకు 53 కొత్త బస్సులు ఇప్పించానని ఎమ్మెల్యే వివరించారు. షాద్ నగర్ నియోజక వర్గంలో 1కోటి 62 లక్షల 9,200 వేల పైచిలుకు మంది ప్రయాణికులు తిరిగారనీ, షాద్ నగర్ డిపోకు 7 కోట్ల 43లక్షల ఆదాయం లభించిందని పేర్కొన్నారు.

**అప్పుడు దిగజార్చి ఇప్పుడు మాటలా....?**

తెలంగాణ వస్తే తమ జాతకం మారుతుందని నమ్మి ఆర్టీసీ కార్మికులు రోడ్డు మీదకు వచ్చి ఉద్యమంలో పాలుపంచుకుంటే తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా దిగజార్చిందని, కార్మికులను కంటతడి పెట్టిందని ఆరోపించారు. ఆర్టీసీ కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే ఆరడుగుల పొడవున్న ఓ హౌలే గాడు ఆర్టీసీని బాగు చేయాలంటూ చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ప్రభుత్వం అన్ని రంగాలపైన ప్రత్యేక దృష్టి పెట్టిందని, ముఖ్యంగా మహిళా సాధికారికతకు ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం రూపుదాల్చిదని గుర్తు చేశారు. పథకాలు అన్నింటిలో మహిళలపై ప్రాధాన్య ఇవ్వడానికి కారణం వారి పొదుపు గుణమని అన్నారు. మగవారి చేతిలో డబ్బులు ఉంటే విలాసాలకు ఖర్చు చేస్తారని, అదే ఆడవాళ్ళు అయితే ఇంటికే వాటిని వినియోగిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దిగజారిపోయిన జీవితాలకు కొత్త వెలుగు వెలుగులు పంచడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంబరాలలో ఉచిత బస్సు సౌకర్యంపై నిర్వహించిన అనేక పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా పలువురు మహిళలకు ఆర్టీసీ తరపున శాలువాలతో సన్మానించి జ్ఞాపికాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉష, మహిళా సంఘం అధ్యక్షురాలు అరుంధతి, అర్జున్, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కే చెన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, పట్టణ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్, పురుషోత్తం రెడ్డి, అందే మోహన్, అనిల్ కుమార్ పాల్గొన్నారు..

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి.**

**ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం ఏర్పాటు చేయాలి.**

**జూనియర్ కాలేజీ విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.**

**ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందీప్ డిమాండ్.**



భద్రాద్రి కొత్తగూడెం


భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బూర్గంపహడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలో పలు పాఠశాలకు బంద్ కు పిలుపునిచ్చి నేడు బంద్ విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందీప్ మాట్లాడుతూ. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు లేకపోవడంతో వారు ప్రయోగాలు చేయడంలో వెనుకంజలో ఉన్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని వారు ఖండించారు. కనీసం విద్యార్థులకు తాగడానికి నీళ్లు లేనటువంటి పరిస్థితి ఉందని విద్యార్థులు బయట నుంచి వాటర్ కొనుక్కొని వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కళాశాలలలో క్లాస్ రూమ్ లో ఫాన్స్, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు సరిగ్గా లేక విద్యార్థుల నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాల నేపథ్యంలో కళాశాలల భవనములు శిథిలావస్థలో ఉండుట కారణంగా గోడలు తడిచి విద్యార్థులు కరెంట్ షాక్కు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వాటి స్థానంలో అదనపు గదులు అదన భవనాలు నిర్మించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. ఇన్ని సమస్యల వలయంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉండట కారణంగా విద్యార్థులు వీటిలో చేరడానికి ఎక్కువగా మొగ్గుచూపడం లేదని , సమస్యలను పరిష్కరించని పక్షాన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలను నిర్వహిస్తామని జిల్లా అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారు చొరవ తీసుకొని జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షాన విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలం శివ నాయకులు కళాశాల విద్యార్థులు కళ్యాణ్ లక్ష్మణ్ అఖిల్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు

# బూర్గంపాడు మండల ప్రజలకు పోలీస్ వారి హెచ్చరిక

**రాబోయే రెండు మూడు రోజులు వర్షాలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి... బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్...**

బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పోలీస్ వారి హెచ్చరిక రానున్న రెండు మూడు రోజుల్లో బూర్గంపాడు మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ ప్రజలకు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని తెలిపారు. అలాగే చిన్న పిల్లలు కాలువలు దగ్గరికి అధికంగా నీళ్లు పారే డ్రైనేజీల దగ్గరికి చిన్న పిల్లలను వెళ్లకుండా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అధిక వర్షాలతో వాగులు వంకలు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలి నాళాలు వాగులు ఉప్పొంగినప్పుడు వాటిని దాటి ప్రయాణించకూడదు ముఖ్యంగా రైతులు పొలాల దగ్గరికి వెళ్ళేటప్పుడు వర్షం కారణంగా వాగులు పొంగి ప్రవహించే ప్రమాదం ఎక్కువగా ఉండటం వలన వాటిని దాటి ప్రయత్నాలు చేయొద్దని ప్రమాదాల బారిన పడతారని రోడ్లపై వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తే ఆ మార్గంలో రాకపోకలు నివారించాలని పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వీధుల్లో రహదారుల వద్ద ఐరన్ కరెంటు స్తంభాలు తీగలు ఐరన్ వైర్లు తడిగా ఉండే అవకాశం ఉండటంతో వాటిని పట్టుకోవడం లాంటి చేయవద్దని సూచించారు అలాగే తీవ్ర వర్షాలు కారణంగా పాత ఇల్లులు కూలే ప్రమాదం ఉన్నందున అటువంటి ఇళ్లను ముందుగానే ఖాళీ చేయాలని సూచించారు. మండల ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో 100 డయల్



చేయండి బూర్గంపాడు పోలీస్ వారికి సమాచారం ఇవ్వవలసిందిగా బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ కోరారు...

## భీంపల్లి గ్రామ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణి

తొలి అడుగు ప్రతినిధి కమలాపూర్





హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల వివిధ గ్రామాలలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు సహాయ మంత్రి. బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా మోడీ కానుకగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పదవ తరగతి విద్యార్థిని విద్యార్థు లకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా మండలం లోని భీంపల్లి గ్రామం లో ప్రభుత్వ పాఠశాల లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థిని లకు సైకిళ్ల ను పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్, భీంపల్లి గ్రామ బూత్ అధ్యక్షులు వాసాల సత్యం, సులుగూరి శ్రీనివాస్ కురిమిళ్ళ సంతోష్, సీనియర్ నాయకులు ఎగ్గొజు శ్రీనివాస్, సముద్రాల మొగిలి, ఎలుగం రాజు, చింతల సుభాష్,పసుల సుభాష్, తోట రాంప్రసాద్ లు పాల్గొన్నారు

## నియోజక అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్

షాద్ నగర్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు అన్నారు. శుక్రవారం నందిగామ మండలంలోని మోత్కుల గూడ గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు 1.20 కోట్లతో మోత్కుల గూడ గ్రామం నుంచి కేసారం గ్రామం వరకు బీటీ రోడ్డు,శ్రీనివాసుల గూడ గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు 58.0 లక్షలతో శ్రీనివాసుల గూడ గ్రామం నుంచి మస్జిద్ మామిడిపల్లి వరకు సీసీ రోడ్డు, బండోని గూడ గ్రామం నుండి బండోనిగూడ తండా వరకు హెచ్ఎండీఏ నిధులు 1.25 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామంలో 20.0 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే డ్వాక్రా భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల అధ్యక్షులు జంగా నర్సింహులు, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార స్వామి గౌడ్, కొమ్ము కృష్ణ,బండోనిగూడ బుచన్న,నర్సప్ప గూడ మాజీ సర్పంచ్ కృష్ణ,డైరెక్టర్ నర్సింహులు, మల్లేష్,మాజీ ఎంపీటీసీ శేఖర్ గౌడ్,నవాజ్ రెడ్డి,శంకరయ్య, శ్రీశైలం, శివ,నరసింహ, సాములయ్య, మహేందర్,నవీన్ కుమార్ గౌడ్, దర్శన్,రాజలింగం, తదితరులు పాల్గొన్నారు..

## ఇంటి ఇంటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



దేవీపట్నం మండలం రంపచోడవరం నియోజకవర్గ దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయితీ ఫజుల్లాబాద్ గ్రామంలో శాసనసభ్యులు గౌరవ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిలిగారు ఇంటి ఇంటికి లిసుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం లో పాల్గొలి ప్రతి గడపకు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడి కూటమి పాలనకోసం చర్చించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు ఆరోగ్య పరిస్థితి బాగాలేని వారి కుటుంబానికి నేనున్నా అంటూ భరోసా ఇస్తూ వారిని ఆప్యాయం గా పలకరిస్తూ గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సీసీ రోడ్లు లేని వీదుల్లో తిరుగుతూ గత ప్రభుత్వం లో ఎంత అభివృద్ధి జరిగిందో గ్రామస్థుల మాటల్లో తెలుసుకున్నారు... ప్రతి సమస్యను పి.ఎ విక్టర్ గారి ద్వారా అర్జీలు పర్సనల్గా డైరీలో నోట్ చేయించటం జరిగింది త్వరలోనే మీ సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని తెలియచేసారు. కూటమి ప్రభుత్వం లో ఈ సంవత్సర కాలం నుంచు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు రానున్న రోజుల్లో చేయబోయే కార్యాచరణ వివరిస్తూ ఎంతో అంగరంగా వైభవంగా సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది.అలానే జూనియర్ కళాశాల యాజమాన్యం కళాశాలకు సంబందించిన అర్జీని గౌరవ ఎమ్మెల్యే శిరీష దేవి గారికి ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమం లో రంపచోడవరం అబ్జార్వ్ గా నియమితులు అయినటువంటి శ్రీనివాస్ యాదవ్ గారు పాల్గొనగా దేవీపట్నం మండలం టీడీపీ జిల్లా మండలం నాయకులు,మాజీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీ లు,జడ్పీటీసీలు,సర్పంచులు వివిధ నామినేటడ్ చైర్మన్స్ నెంబర్స్,గ్రామ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొనగా జనసేనపార్టీ మండల అధ్యక్షులు చారపు వెంకటరాయుడు ప్రధాన కార్యదర్శి కొమరం దొరబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కుంజం శ్రీనివాస్ దొర, మండల సీనియర్ నాయకులు ఐనవిల్లి భద్రం,పెండేటి నర్సింమూర్తి,కొత్తపల్లి సతీష్, తాళ్లూరి పవన్ కుమార్ రెడ్డి,ఈక నాగన్న దొర,పండు దొర, గొందురు గ్రామ అధ్యక్షులు తాటి రాజు,తుర్రం ధర్మజు,సోదే రవి,కాలుం మహేష్,మీడియా కోఆర్డినేటర్ కారం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు...

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

## ప్రభుత్వ దవాఖాన పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయించాలి

**కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక



చేర్యాలలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ దవఖానాలు పెండింగ్లో ఉన్న పనులన్నింటిని వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కలెక్టర్ హైమావతిని కోరారు. చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు చేర్యాల పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దావకానకు అప్రోచ్ రోడ్స్ లేవని వెంటనే వాటిని పూర్తి చేయించాలని, అలాగే నూతన భవనంలో అంతర్గత రోడ్లు సౌకర్యాలు పెండింగ్లో ఉన్నాయన్నారు పనులను సకాలంలో పూర్తి చేసి పాత భవనం నుంచి కొత్త భవనంలోకి దవాఖానాలను మార్చితే ప్రజలకు వసతిగా ఉంటుందన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ అప్రోచ్ రోడ్ లో పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యేకు తెలియజేశారు

## అభివృద్ధి నిధులు జేబుల్లోకి వరదలు రోడ్ల మీదకి ప్రజల ఇళ్లలోకి

మణుగూరు, జులై 23 తొలిఅడుగు:



మణుగూరు మండలంలొ ది. 23-07-2025 నాడు మండల సమావేశంలో సోలం హరిశంకర్ మాట్లాడుతూ గత సంవత్సరం మణుగూరు పట్టణంలొ భారీ స్థాయిలో వరద ప్రవాహానికి గురి కావడం వలన చాలా కుటుంబాలు మరియు వ్యాపారాలు ఆర్థికంగా నష్టపోవడం జరిగింది. గతంలో ఇలాంటి దుర్ఘటనలు జరిగిన గాని ప్రస్తుతం వర్షంకాలం సభవించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు అనడానికి ఇప్పుడు మణుగూరు చుట్టూ ముట్టిన వరదలు ఇందుకు నిదర్శనం అని చెప్పవచ్చు. వరద ప్రవాహానికి గురికావడం ప్రధాన కారణం ఏమిటీ అంటే ప్రభుత్వం స్థలాలును, వాగులను చిన్ని చిన్న కాలువలను సైతం కూడా కొంతమంది బడా బాబులు ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మాణం చేసుకొవడం వలననే వరదలకు కారణం. ప్రధాన రహదారి ప్రక్కన సంజీవని పిల్లలు హాస్పిటల్,మౌనిక రెస్టారెంట్ లు ప్రభుత్వం స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా వారి ప్రక్కన ఉన్న సగం వాగును కూడా ఆక్రమించి బహుళ అంతస్థుల నిర్మాణం చేశారు. ప్రధాన రహదారి అటువైపు ఉన్న అలాగే ఆదర్శ నగర్ లో కూడా ఇదే విధంగా కాలువను సగం ఆక్రమించి నిర్మాణాలు చేసారు.దీని వలన ఆదర్శ నగర్ తో పాటు పైన ఉన్న శ్రీ శ్రీ నగర్, వినాయక నగర్, సుందరయ్య నగర్ వరద ప్రభావానికి గురి అవుతుంది. అలాగే మెట్లవాగు గతంలో విశాలంగా ఉండేది. అప్పుడు ఎంత వరద నీరు అయినా సులువుగా వెళ్ళేది కానీ ఇటీవలే కాలంలో దాని కూడా ఆక్రమించడం వలన వాగు చిన్నిగా తక్కువ నీరు వెళ్లడమే జరుగుతుంది మిగతా వరద అంత ఇళ్ల మీదకు వస్తుంది. వినాయక నగర్, సుందరయ్య నగర్, కుంకుడు చెట్ల గుంపు గ్రామాల పైన పంట పొలాల నుండి వచ్చే వరద నీరు పోవడానికి సరి అయిన కాలువలుగాని వాగుగాని లేక వరద ఎటుపోయి పరిస్థితి లేక వరద అంత ఇల్లు మీదకు రావలసిందే. దీనికి ప్రధాన కారణం కాలువలను వాగులను ఖాళీ స్థలను సైతం ఆక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేయడమే. కావున వెంటనే రెవిన్యూ మరియు మున్సిపాలిటీ అధికారులు అక్రమా నిర్మాణాలు తొలగించి, వరద ప్రవాహం నుండి మణుగూరు ప్రజలును మణుగూరు పట్టణాన్ని కాపాడాలి. ఇప్పటికే వరద ప్రభావానికి గురి అయిన కుటుంబలకు తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలి అని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మడి రమేష్, కార్యదర్శి వంక శేఖర్, మడకం శ్రవణ్, గణిబోయిన రాజ్ తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## వేలేరు మాజీ జడ్పీటీసీ చాడ సరిత రెడ్డి అక్క సంతాప సభలో పాల్గొని నివాళ్లు అర్పించిన బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఉల్లేగుల సందీప్,

జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక



జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సోదరి వేలేరు మాజీ జడ్పీటీసీ చాడ సరిత రెడ్డి అక్క సంతాప సభలో పాల్గొని నివాళ్లు అర్పించిన బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఉల్లేగుల సందీప్, 20వ వార్డు అధ్యక్షులు దావేర రాజు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి జాయ శ్రీశైలం, యూత్ నాయకులు చెన్నూరు నవీన్.

## జనగామ అమ్మ ఫౌండేషన్

జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక



ఈరోజు జనగామ జిల్లా నర్మెట్ట మండలం వెల్దండ గ్రామానికి చెందిన మేక రాజు 28వ పుట్టినరోజు సందర్భంగా జనగామ పట్టణంలోని రాజజేశ్వరి సేవా సధన్ అనాధ వృద్ధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమరాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న మేక రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఇప్పుడున్న యువత ఆదర్శంగా భారతదేశంలోని ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా నిలువ నీడలేని నిరాశ్రయులకు అనాధలకు వృద్ధులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాజు స్నేహితులు బొల్లం అవినాష్ గోరంతల వెంకటేష్ మరియు ఆశ్రమ నిర్వాహకులు రాజేశ్వరి పాల్గొన్నారు

## జనగామ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల అద్వర్యం లో బంద్ విజయవంతం

జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక



ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ యూనస్ జనగమ జిల్ల కేంద్రం లో ప్రైవేట్ స్కూలు మరియు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సైతం బందుకు మద్దతు తెలిపారు ఖాళీగా ఉన్న టీచర్, ఎం ఈ ఓ, డి ఈ ఓ, పోస్టులు భర్తీ చేయాలి. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు మౌళిక సదుపాయాలు కల్పించి, నిధులు ఇవ్వాలి పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలి. అద్దె భవనాలలో నడుస్తున్న వసతి గృహాలకు స్వంత భవనాలు నిర్మించాలి. గురుకులాలలో అశాస్త్రీయంగా తీసుకు వచ్చిన సమయపాలనను మార్చాలి. బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్ నిధులు ఇవ్వాలి. విద్యార్థులకు ఆర్టీసిలో ఉచిత బస్పాసులు ఇవ్వాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్, లెక్చరర్ పోస్తులు భర్తీ చేయాలి ఎన్ఈపి-2020 తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడల రమేష్,జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మి శెట్టి ఆర్య జిల్లా నాయకులు రమేష్,మనిత్ రాజ్,అనిల్,వెంకటేష్,మానస ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు విప్లవ్,సునీల్,రంజిత్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్మూర్ నగర గౌడ యువసేన అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్ గౌడ్



తొలిఅడుగు నిజామాబాద్ ప్రతినిధి:



నిజామాబాద్ జిల్లా గౌడ యువసేన కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ నగర యువసేన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆర్మూర్ నగర గౌడ యువసేన అధ్యక్షుడుగా బత్తుల శ్రీనివాస్ గౌడ్, ఆర్మూర్ టౌన్ ఉపాధ్యక్షుడిగా అలల శివగౌడ్ నాగుల శివగౌడ్ (పెర్కిట్), ప్రధాన కార్యదర్శిగా మెడిదాల క్రాంతి గౌడ్ (మామిడిపల్లి), కోశాధికారిగా పేర్ల ప్రవీణ్ గౌడ్ (కోటా ఆర్మూర్)లు ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా నగర గౌడ యువసేన అధ్యక్షుడుగా బత్తుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తన పై నమ్మకం తో నన్ను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. జిల్లా గౌడ యువసేన కమిటీ సూచనల మేరకు నగర కమిటీ పని చేస్తుందని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కి అత్యధిక స్థానాలు.



జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక

ఈరోజు భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జనగామ రూరల్ మండలం స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు శ్రీ సౌడ రమేష్ విచ్చేసి మాట్లాడుతూ జనగామ మండలంలోని అన్ని గ్రామాలలో రానున్న స్థానిక సంస్థల ఎలక్షన్లలో భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాలలో గెలిచి తమ సత్తా చాటుతామని గత పాలకులైన టిఆర్ఎస్ పార్టీ ఇప్పటి కాంగ్రెస్ పార్టీ ఇద్దరు ఒకటేనని ప్రజలను మభ్యపెట్టి మోసగించడం , అధికార దాహం తప్ప ప్రజలపై చిత్తశుద్ధి లేదని ఎటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేయలేదని, గత 11 సంవత్సరాలుగా గ్రామాలలో కేవలం 14వ, 15 వ ఫైనాన్స్ కమిషన్ కేంద్ర నిధుల ద్వారానే అభివృద్ధి జరిగిందని, ప్రజలు రానున్న ఎలక్షన్లలో భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోడీ నాయకత్వానికి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని భారతీయ జనతా పార్టీ మండలంలో అత్యధిక స్థానాలు గెలిచి తమ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మార్గ ఉపేందర్ గౌడ్ ,జిల్లా కార్యదర్శి సరికొండ భాస్కర్ రెడ్డి , బీజేవైమ్ జిల్లా అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి, బీజేవైమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్ , ప్రధాన కార్యదర్శి రమేష్ , నవీన్ కుమార్ జంపన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

**హుజురాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో తుమ్మచెట్లు తొలగింపు**
**- హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కు ధన్యవాదాలు**
**- కాంగ్రెస్ పార్టీ నాయకులు సందమల్ల నరేష్**



హుజురాబాద్

హుజురాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డు లోని సిక్కువాడ నుండి సైదాపూర్ రోడ్ మసీదు వరకు ఎన్నో సంవత్సరాల నుండి ఏపుగా పెరిగినటువంటి తుమ్మచెట్ల ద్వారా, వర్షాల వలన నిల్వ ఉంటున్నటువంటి నీటి ద్వారా ఇబ్బందులకు గురవుతున్న ప్రజల సమస్యలను 13వ వార్డు సభ్యులు సందమల్ల బాబు హుజురాబాద్ మున్సిపల్ కమీషనర్ కెంసారపు సమ్మయ్య కు తెలపడం జరిగింది. సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించిన మున్సిపల్ కమీషనర్ సమ్మయ్య తుమ్మచెట్లను తొలగిస్తూ, వర్షపు నీటిని తాత్కాలిక పిల్ల కాలువ ద్వారా తొలగించడానికి పనులు మొదలుపెట్టారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యను తీరుస్తున్నటువంటి హుజురాబాద్ కమిషనర్ కు వార్డు ప్రజలు ధన్యవాధాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సందమల్ల నరేష్, ముక్క రవితేజ, రజిత, రమ, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం తండ్లాట.. స్నానాలకు, కాలకృత్యాలకూ తిప్పలు..

తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్ :



కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలోని ఒకటవ వార్డులో ప్రజలు గత నాలుగు రోజులుగా తాగునీటి కోసం తల్లడిపోతున్నారు. గ్రామ పంచాయతీ బోరు సరఫరాలో ఆటంకం ఏర్పడం తో గత నాలుగు రోజులుగా తాగునీరు అరకొరగా రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు బుధవారం ఖాళీ బిందెలు, బకెట్ల తో రోడ్డుపై నిరసన తెలిపారు. బోర్ మోటార్లలో కూడా సరిపడా నీళ్లు రావడంలేదని, దోమల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాధికారులు తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు...

**స్నానాలకు, కాలకృత్యాలకూ తిప్పలు..**

నల్లా నీరు రాక వంట పనులు, స్నానాలకు, కాలకృత్యాలకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే తమ గ్రామానికి మంచినీటిని సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కవిత, అంజమ్మ, శంకరమ్మ, విమలమ్మా, శాంతమ్మ, పలువురు కోరుతున్నారు..పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామ పంచాయతీ బోరు పని చేయడం లేదు..దాని రిపేర్ అవుతుంది అని చెపుతున్నాడ కానీ గత నాలుగు రోజుల నుండి రాక నానా ఇబ్బందులు పడుతున్నామని త్వరగా ఈ సమస్య పరీక్షించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

## విద్యాసంస్థల బంద్ విజయవంతం





జనగామ,జులై 23 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చారు స్టేషన్ ఘనపూర్ లో ఏ ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక విద్యాసంస్థలన్ని తిరిగి బంద్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ యునస్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఎం ఈ ఓ, డి ఈ ఓ పోస్టులను భర్తీ చేయాలి, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి, పెండింగ్ లో ఉన్న ఫీజు రీ ఎంబర్స్మెంట్ స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలి అని తదితర డిమాండ్ లతో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఐ ఎస్ ఎఫ్ మండలం నాయకులు పస్తం పృథ్వి రాము అఫ్రోజ్ రాజేష్ రమేష్ సురేష్ మరియు పాఠశాల కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# వారంలో పూర్తి.. ఉస్తాద్ భగత్ సింగ్‌పై పవన్ కల్యాణ్ కామెంట్స్ వైరల్




పవన్ కల్యాణ్ హరీష్ శంకర్ కాంబినేషన్ అంటే బాక్సాఫీస్ వద్ద అంచనాలు ఏ రేంజ్‌లో ఉంటాయో తెలిసిందే. గబ్బర్ సింగ్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ కాంబోలో వస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. కాగా హరిహరవీరమల్లు జులై 24న విడుదల కానున్న నేపథ్యంలో ప్రస్తుతం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు పవన్ కల్యాణ్. తాను నటిస్తోన్న మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ గురించి పవన్ కల్యాణ్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ మీడియాతో చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయం చెప్పి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. ఫ్యాన్స్, ఫాలోవర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ గురించి లీక్ ఇచ్చేసి క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ కొనసాగుతుందని.. తన పార్ట్‌కు సంబంధించిన చిత్రీకరణ ఐదారు రోజుల్లో పూర్తవుతుందని చెప్పాడు పవన్ కల్యాణ్. అంటే పవన్ కల్యాణ్ మరోవైపు ఉస్తాద్ భగత్‌సింగ్‌ను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నాడని అర్థమవుతుంది. తాజా కామెంట్స్‌తో పవన్ కల్యాణ్ తన సినిమాల కమిట్‌మెంట్స్‌ను పూర్తి చేసి.. రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టబోతున్నాడంటూ ఇండస్ట్రీలో తెగ చర్చించుకుంటున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా శ్లోక పాత్రలో కనిపించనుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తోన్నఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇంకేంటి మరి రానున్న రోజుల్లో ఉస్తాద్ భగత్ సింగ్‌కు సంబంధించి బ్యాక్ టు బ్యాక్ అప్‌డేట్స్ రెడీ అవుతున్నాయన్నమాట.

# 'ఆ జాబ్ వెట్టి చాకిరితో సమానం.. అప్పటికే భాయ్‌ఫ్రెండ్‌తో డేటింగ్'



యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి తెలుగు స్టార్‌గా ఎదిగిన నటి అనసూయ. రంగస్థలంలో రంగమ్మత్తగా.. పుష్ప చిత్రంలో దాక్షాయణి పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియా ఫుల్ యాక్టివ్‌గా ఉంటోన్న అనసూయ.. తాజాగా తన ఫ్యాన్స్‌తో మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. తాను ఓ వీఎఫ్ఎక్స్ కంపెనీలో పనిచేశానని అనసూయ తెలిపింది. అక్కడంతా వెట్టిచాకిరి చేయాల్సిందేనని.. ఎనిమిది గంటల పాటు వర్క్ చేయాలనే రూమ్ ఏమి ఉండదని చెప్పింది. ఒక ప్రాజెక్ట్ తీసుకుంటే ఇచ్చిన టైమ్‌లోనే ఫినిష్ చేయాలని అనసూయ వివరించింది. టైమ్‌లోనే తనను సుకుమార్, మెహర్ రమేశ్, త్రివిక్రమ్ లాంటి వాళ్లు తనను చూశారని వెల్లడించింది. ఎన్టీఆర్ నటించిన కంత్రి సినిమాకు మా టీమ్ వర్క్ చేసిందని.. అప్పుడు నేను కౌన్సిలర్‌గా, హెచ్‌ఆర్ ఉన్నానని అనసూయ వివరించింది. హాలీవుడ్‌తో పాటు తెలుగులో పలు సినిమాలకు వీఎఫ్ఎక్స్ చేశామని తెలిపింది. వీఎఫ్ఎక్స్‌లో కంపెనీలో పని చేసే సమయంలో తాను డేటింగ్‌లో ఉన్నానని అనసూయ రివీల్ చేసింది. నా లైఫ్‌లో ఒక్కరే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని.. అతన్నే పెళ్లి చేసుకున్నాని వెల్లడించింది. అంతేకాకుండా తనకు పవిత్ర ?అనే పేరు మా అమ్మ పెట్టాలని అనుకుందని తెలిపింది. కానీ నాన్న వాళ్ల అమ్మగారి పేరు పెడదామని అనసూయ పెట్టేశారు. మా ముగ్గురికి అనసూయ, అంబిక, సాయి వైష్ణవి అని పెట్టారని గుర్తు చేసుకుంది.

# సినీ నటుడు రానాకు ఈడీ మళ్లీ సమన్లు



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కేసులో రానాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. ఆగస్ట్ 11న విచారణకు హాజరు కావాలని మసన్లలో పేర్కొంది. వాస్తవానికి నేడు(జులై 23) రానా ఈడీ విచారణకు హాజరు కావాల్సింది. కానీ ఆయన గడువు పొడిగించాలని ఈడీకి విజ్ఞప్తి చేశాడు. దీంతో తాజాగా మరో తేదిని ఖరారు చేస్తూ సమన్లు జారీ చేసింది. ఆగస్ట్ 11న కచ్చితంగా హాజరు కావాలంటూ సమన్లలో పేర్కొంది. సైబరాబాద్, సూర్యాపేట, పంజగుట్ట, మియాపూర్, విశాఖపట్నంలో లోన్ యాప్‌లపై నమోదైన వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన విషయం తెలిసిందే. లోన్ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది.




# రొమాంటిక్‌గా తేజ సజ్జా, రితికా నాయక్.. మిరాయి ఫస్ట్ సింగిల్ ఆన్ ది వే

హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నాడు యువ నటుడు తేజసజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న మరో పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఢిల్లీ భామ రితికా నాయక్  ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. సినిమా కోసం ఎదురుచూస్తున్న వారి కోసం మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ వైబ్ ఉంది అప్‌డేట్ అందించారు. వైబ్ ఉంది అంటూ సాగే మెలోడీ ట్రాక్‌ను జులై 26న తెలుగుతోపాటు పలు ప్రధాన భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తేజ సజ్జా, రితికా నాయక్ రొమాంటిక్ ఫోజులో ఉండటం చూడొచ్చు. మిరాయి అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2025 సెప్టెంబర్ 5న పలు భాషల్లో విడుదల కానున్నట్లు ప్రకటించి సినిమా వాయిదా పుకార్లకు చెక్ పెట్టారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తుండగా.. గౌరా హరి సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుందని ఇప్పటికే వార్తలు రాగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన మిరాయి టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది.

# మాస్ సినిమాతో సూర్య..



'కంగువ'తో ఓ రేంజులో దెబ్బతిన్న సూర్య.. 'రెట్రో'తో కొంతమేర పర్వాలేదనిపించుకున్నాడు. ఎందుకంటే తమిళంలో మోస్తరుగా ఆడిన ఈ చిత్రం.. తెలుగులో మాత్రం ఘోరమైన ఫ్లాప్ అయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'కరుప్పు' మూవీతో వస్తున్నాడు. బుధవారం సూర్య పుట్టినరోజు సందర్భంగా టీజర్ రిలీజ్ చేశారు. 'కరుప్పు' అంటే తమిళంలో నలుపు అని అర్థం. మరి దర్శకనిర్మాతలు ఏం ఆలోచించారో ఏమోగానీ అదే టైటిల్‌ని యథాతథంగా ఉంచేశారు. టీజర్ చూస్తుంటే కూడా తమిళ ఫ్లేవర్ ఎక్కువగానే కనిపిస్తుంది. కాకపోతే మాస్ సీన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో సూర్య సరసన త్రిష హీరోయిన్‌గా చేస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకుడు.